**జాతీయ రహదారికి పగుళ్లు** 2





**ఆర్మూర్‌లో ఊరపండుగ** 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## బైక్ కవర్‌లో నుంచి డబ్బు మాయం

**అక్షరటుడే, బాల్కొండ:** బైక్‌లలో నగదు ఉంచి ఏమరపాటుగా ఉంటే కేటుగాళ్లు క్షణాల్లో మాయం చేస్తున్నారు. నగదును వాహనాల్లో ఉంచవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు పెడచెవిన పెడుతున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముప్కాల్ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిందేకర్ గంగాధర్ జూలై 20న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యూనియన్ బ్యాంక్ నుంచి రూ.20 వేల నగదును డ్రా చేశాడు. వాటిని బైక్ కవర్‌లో పెట్టి నవీన్ మెడికల్‌లో మందులు తీసుకునేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా బైక్‌లో ఉంచిన నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు.





## లింబాద్రి నృసింహుడిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ శివారులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానాన్ని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. జస్టిస్ తంగిరాల మాధవి దేవి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జిల్లా జడ్జి భరత లక్ష్మి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు, ఆలయ ప్రధాన అర్చకులు నంబి పార్థసారథి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అలాగే ఆలయ చరిత్ర, క్షేత్ర విశిష్టతలను న్యాయమూర్తులకు వివరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థప్రసాదాలను అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తుల పర్యటన సందర్భంగా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నవదుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద నవ దుర్గాదేవి ఆలయంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బోనం ఎత్తుకున్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రతియేటా టీజీవో ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ, శశాంక్ రెడ్డి, టీజీవో ఎంప్లాయీస్ అధ్యక్షుడు అలుక కిషన్, అమృత్ కుమార్, చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్, దాస్, సత్యం, పెద్దోళ్ల నాగరాజు, చందన్ పాల్గొన్నారు.

# ఓటర్లకు అలర్ట్..



**'సర్' ఫారాలు ఇచ్చేందుకు సమీపిస్తున్న గడువు**

**జిల్లాలో 85 శాతం పూర్తి**

**త్వరగా అందజేయాలని అధికారుల సూచన**

**'సర్' ప్రక్రియకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వడంలో ఓటర్లు మీనమేషాలు లెక్కిస్తున్నారు. గడువు పొడిగించారులే.. చూద్దాంలే.. ఇద్దాంలే.. అని నిర్లక్ష్యం చేస్తున్నారు. తద్వారా స్థానిక బీఎల్‌వోలు.. ఆపై అధికారులపై రోజురోజుకూ ఒత్తిడి పెరుగుతోంది.** —**అక్షరటుడే, ఎల్లారెడ్డి**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కామారెడ్డి జిల్లాలో కొనసాగుతోంది. ఎన్యుమరేషన్ ఫారాలను ఈ నెలాఖరు లోగా బీఎల్‌వోలకు అందజేస్తేనే వాటిని నిర్ణీత సమయానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీలుంటుందని 'సర్' అధికారులు పేర్కొంటున్నారు. గడువు ముగిస్తే ఆన్‌లైన్ నమోదుకు కేవలం 3 రోజులే సమయం మిగులుతుందని, కాబట్టి ఓటర్లు తక్షణమే స్పందించి పూర్తి చేసిన ఫారాలను అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### 85.54శాతం డిజిటలైజేషన్ పూర్తి

ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రతిరోజు సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 85.54శాతం నమోదు ప్రక్రియ పూర్తవ్వగా, ఇంకా 14.46 శాతం డిజిటలైజేషన్ పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలోని మొత్తం 796 బూత్‌లకు గాను 400 కంటే ఎక్కువ బూత్‌లలో 100శాతం ప్రక్రియ పూర్తయింది.

### సమయం తక్కువగా ఉన్నందున..

బీఎల్‌వోలు మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణ పరిధిలోని పలువురు ఓటర్లు తమ సొంత గ్రామాల్లో సర్ ఫారాలు అందించడం వల్ల ఇక్కడ నమోదు శాతం కాస్త తక్కువగా నమోదైందని పేర్కొంటున్నారు. అయితే సమయం తక్కువగా ఉన్నందున నింపిన ఫారాలను వెంటనే స్థానిక బీఎల్‌వోలకు అందజేయాలని సూచిస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో బీఎల్‌వోలు సైతం ఇంటింటికీ తిరుగుతున్నారని వారికి ఫారాలు ఇచ్చినా సరిపోతుందని పేర్కొంటున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వకుంటే ఓటు హక్కు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఫారం ఇవ్వకుంటే ఓటు గల్లంతయితే తర్వాతి ప్రక్రియ వరకు వేచి ఉండవద్దని సలహా ఇస్తున్నారు.

**కామారెడ్డి జిల్లా సమగ్ర గణాంకాలు**

**మొత్తం బూత్‌లు: 796**
**మొత్తం ఓటర్లు: 6,96,006**
**డిజిటల్ అయిన ఓట్లు: 5,95,366**
**వందశాతం పూర్తయిన బూత్‌లు: 400 పైగా..**

**నియోజకవర్గాల వారీగా పురోగతి వివరాలు**

**ఎల్లారెడ్డి నియోజకవర్గం–88.98 శాతం**
**కామారెడ్డి నియోజకవర్గం–80.21 శాతం**
**జుక్కల్ నియోజకవర్గం–88.43 శాతం**

## ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో విషాదం.. ముగ్గురు మృతి



**అక్షరటుడే, బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ పరిధిలో విషాదం నెలకొంది. బ్యాక్ వాటర్‌లో సరదాగా గడిపేందుకు వచ్చిన ఐదుగురు యువకుల్లో నలుగురు గల్లంతయ్యారు. నిజామాబాద్‌కు చెందిన మెకానిక్‌లు ఖలీం, నవాజ్, అజీం, మరో ఇద్దరు వ్యక్తులు, అలాగే మహారాష్ట్రలోని బోకర్ హిమాయత్‌నగర్‌కు చెందిన రెహమాన్ ఆదివారం ఉదయం బ్యాక్‌వాటర్ ప్రాంతానికి వచ్చారు. యువకులంతా నీళ్లలో స్నానానికి దిగిన అనంతరం నలుగురు యువకులు గుంతల్లో మునిగి గల్లంతయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే సీఐ జాన్‌రెడ్డి, ముప్కాల్ ఎస్సై కిరణ్‌కుమార్, మెండోరా ఎస్సై సుహాసిని సంఘటనాస్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టగా.. గల్లంతైన నలుగురిలో ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మరొకరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సీపీ సాయిచైతన్య పరిశీలించారు.

## ఆడపిల్లకు జన్మనిచ్చిన కలెక్టర్..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమెకు డెలివరీ చేశారు. నిండు గర్భిణిగా ఉన్నప్పటికీ కలెక్టర్ అధికారిక కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఎస్ఐఆర్ పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ జిల్లా అధికారులకు ఆదేశాలిస్తూ ఆమె విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా 23వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చారు. జిల్లా అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కార్గిల్ అమరుల త్యాగాలు మరువలేనివి..



**అక్షరటుడే, కామారెడ్డి:** కార్గిల్ యుద్ధ అమరుల త్యాగాలు మరువలేనివని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ శిబిరాన్ని నిర్వహించడం ఇతరులకు స్ఫూర్తినిస్తుందన్నారు.

### రక్తదానంతో మరొకరి ప్రాణాలు భద్రం


మనం చేసే ఒక రోజు రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని, ఒకరి జీవాన్ని నిలబెట్టడం కంటే గొప్ప కార్యం మరొకటి లేదని ఛైర్‌పర్సన్ అన్నారు. సేవాభావాన్ని పెంపొందించుకుని ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు భూపతి, పాపిరెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ రాజన్న, కరస్పాండెంట్ నర్సింగ్ రావు, జాయింట్ సెక్రెటరీ సాయన్న, వైస్ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, ట్రెజరర్ నరేందర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంవో సంతోష్, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## 'మన్ కీ బాత్' వీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్




**అక్షరటుడే, ఇందూరు:** పీఎం నరేంద్ర మోదీ 136వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వీక్షించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' రాజకీయ కార్యక్రమం కాదని, దేశంలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు, జాతీయ విలువలు, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి అనే అంశాలను ప్రజలకు చేరవేసే వేదిక అన్నారు. కార్గిల్ వీరుల త్యాగం నుంచి నీటి సంరక్షణ వరకు, స్వదేశీ రక్షణ సామర్థ్యం నుంచి యువత విజయాల వరకు ప్రతి అంశం దేశాన్ని మరింత బలోపేతం చేసే దిశలో ప్రజలను ప్రేరేపించే సందేశాన్ని ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనిత, యువమోర్చా అధ్యక్షుడు వంశీ, మైనారిటీ మోర్చా జస్పాల్ సింగ్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, మఠం పవన్, జ్యోతి మురళి, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, మమత శివ, యువమోర్చా రాష్ట్ర నాయకులు విజయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి: గంప గోవర్ధన్




**అక్షరటుడే, కామారెడ్డి :** 'సర్' ప్రక్రియపై పార్టీ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. ఆదివారం తన నివాసంలో కామారెడ్డి మండల, మున్సిపాలిటీ స్థాయి కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గంప గోవర్ధన్ మాట్లాడుతూ అసలైన ఓటర్ల ఓటు హక్కును కాపాడేందుకు అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. బీఎల్‌వోలు అందజేసిన దరఖాస్తు ఫారాలను పూర్తి చేయించి అందజేసేలా చూడాలని సూచించారు. ఈ నెల 3వ తేదీలోపు పూర్తయిన దరఖాస్తులను బీఎల్‌వోలకు సమర్పించాలని, 10వ తేదీన ప్రచురించే ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల పేర్లు ఉన్నాయా లేవా అని తనిఖీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అరికల ప్రభాకర్ యాదవ్, హఫీజ్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, నాయకులు కాసర్ల స్వామి, ప్రభాకర్ రెడ్డి, బల్వంత్ రావు, జెర్సీ నర్సింలు, హన్మాండ్లు, కృష్ణాజీ రావు, శశికాంత్, పుల్లూరు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గండిమాసానిపేట్‌లో మద్యం విక్రయాల బంద్‌కు తీర్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో ఐదో వార్డు గండిమాసానిపేట్ గ్రామంలో గ్రామ పెద్దలు ఆదివారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో మద్యం విక్రయాలు నిర్వహించద్దని ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో ఉన్నటువంటి బెల్టు షాపులను తొలగించాలని, మద్యపానం నిషేధించామని తెలిపారు. గ్రామంలో ఇకనుండి మద్యం అమ్మితే రూ.50 వేల జరిమానా విధిస్తామన్నారు. ఈ తీర్మాన పత్రాన్ని స్థానిక కౌన్సిలర్ అట్కరి చంద్రయ్య, ఎస్సై రాజుకు అందించారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాలను అందజేస్తామన్నారు. గ్రామంలో యువత మద్యానికి బానిసై అనారోగ్యాల పాలవుతున్నారని.. పనులు చేసుకోకుండా వ్యసనపరులుగా మారుతున్నారని గ్రామస్తులు వాపోయారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ వహీద్, మాజీ సర్పంచ్ వెంకటేశం, గ్రామస్తులు ముఖీద్, నారాయణ, సతీష్ కుచులకంటి, శంకర్ దేవదాస్ బబ్లూ, రాములు, ప్రవీణ్, కోడిపాక సాయిలు, పరంధాములు, శివరాములు, పరమేశ్వర్, చంద్రయ్య, సందీప్, నరేష్, జంగ శంకర్, దుర్గయ్య, నాగభూషణం, సాయిలు, సిద్ధిరాములు, బాబు మల్లేష్, రక్షణ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## భీమ్‌గల్‌లో జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం



**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జూనియర్ సివిల్ జడ్జికమ్‌జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు'ను ఆదివారం ప్రారంభించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, నిజామాబాద్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తంగిరాల మాధవీ దేవి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి న్యాయస్థానాన్ని ప్రారంభించారు.

### త్వరితగతిన సేవలు

జస్టిస్ మాధవీ దేవి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు, వ్యాజ్యదారులకు వేగవంతమైన, సులువైన న్యాయ సేవలు అందించేందుకు స్థానికంగా కోర్టుల ఏర్పాటు ఎంతో దోహదపడుతుందన్నారు. భీమ్‌గల్ పరిసర ప్రాంతాల ప్రజలు ఇకపై కోర్టు పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, దీనివల్ల సమయంతో పాటు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరత లక్ష్మి, ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ చందర్, న్యాయవాదులు చైతన్య, సూర సురేష్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో అంగరంగ వైభవంగా జరిగిన మైసమ్మ ఆషాఢ బోనాల ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు.డప్పు వాయిద్యాల మోతలు, పోతరాజుల విన్యాసాలు, చిన్నారుల కేరింతలు, యువతీ యువకుల నృత్యాల మధ్య బోనాల ఉత్సవం ఉత్సాహంగా సాగింది. కాలనీవాసులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఛైర్‌పర్సన్ అమ్మవారి దయతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు ఆనందంగా ఉండాలని, మన పట్టణం సస్యశ్యామలంగా, సుభిక్షంగా విలసిల్లాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గంగరాజు, స్వామి, సురేష్, నాగరాజు, అక్షయ్, అఖిల్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ ఆలయంలో బోనాలు




అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఎనిమిదో డివిజన్‌లో బంగారు మైసమ్మ ఆలయంలో కాలనీవాసులు పెద్దఎత్తున బోనాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి భక్తితో బోనాలు తీశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కిషన్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన ర్యాలీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఎస్ఐఆర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 36,37 డివిజన్ల SIR అబ్జర్వర్ గన్‌రాజ్ పర్యవేక్షణలో, బండారి రమేష్ సమన్వయంతో.. 36వ డివిజన్‌లో కాంగ్రెస్ ఇన్‌ఛార్జి విక్కి యాదవ్, 37వ డివిజన్ ఇన్‌ఛార్జి కరిపె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్యుమరేషన్ ఫారాల్లో సందేహాలను నివృత్తి చేశారు. నింపిన ఫారాలను వెంటనే బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం గంగాధర్, 38వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యులు బొబ్బిలి మురళి, ఈఆర్‌వో కోఆర్డినేటర్ వహీద్, ధాత్రిక భాస్కర్, ఆకుల వెంకటేష్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.







# జాతీయ రహదారికి పగుళ్లు

- ఎల్లారెడ్డి – రుద్రూర్ రోడ్డు నాణ్యతపై అనుమానాలు
- నత్తనడకన నిర్మాణ పనులు
- కంకర వేసి వదిలేయడంతో వాహనదారులకు తిప్పలు

**ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్ వరకు చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. అయితే రోడ్డు పనుల్లో నాణ్యతాలోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్లుగా సాగుతున్న ఈ రహదారి నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

**– అక్షరటుడే, బాన్సువాడ**

బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామ సమీపంలో నిర్మించిన రహదారి కొంతభాగం కోతకు గురికావడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 65 కిలోమీటర్లు రూ.499 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన ఈ నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలోనే పలుచోట్ల రహదారి కోతలకు గురికావడం, పగుళ్లు ఏర్పడటం పనుల నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. భారీ వాహనాల రాకపోకలు, వర్షాల ప్రభావంతో రహదారి దెబ్బతింటుండటంతో సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### నెలల తరబడి కంకరతోనే..

రహదారి నిర్మాణంలో భాగంగా పలుచోట్ల కంకర, మెటీరియల్ వేసి నెలల తరబడి అలాగే వదిలేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రహదారి పనులు ఒక దశలో నిలిచిపోవడంతో దుమ్ముధూళి సమస్యలు తలెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల రహదారి అసమానంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఆర్టీసీ బస్సులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు చెబుతున్నారు.

### పనుల్లో జాప్యంపై అసంతృప్తి

ఎల్లారెడ్డి-రుద్రూర్ మధ్య ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంపై వాహనదారులు, స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భారీ ఎత్తున నిధులు వెచ్చించి చేపడుతున్న ఈ నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### నాణ్యతపై సమగ్ర తనిఖీలు చేయాలి

నిర్మాణ పనులు పూర్తికాకముందే రహదారికి పగుళ్లు, కోతలు ఏర్పడటానికి కారణాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా పనులు చేపట్టినట్లు తేలితే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రహదారి పనుల్లో జాప్యాన్ని నివారించి, దెబ్బతిన్న ప్రాంతాలను వెంటనే పునరుద్ధరించడంతో పాటు ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## రైతులకు జిప్సం బ్యాగుల పంపిణీ

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని మాతృసంగెం గ్రామంలో ఆదివారం రైతులకు జిప్సం బ్యాగులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ వందన బలవంతరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున 90 శాతం సబ్సిడీతో బస్తాలను అందజేసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుచ్చి స్వామి, వార్డు మెంబర్లు, వీడీసీ ఛైర్మన్, రైతులు పాల్గొన్నారు.

## టీటీడీ కల్యాణ మండపంలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండపం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, చెట్ల కొమ్మలను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి వారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీటీడీ కల్యాణ మండపం ఇన్‌ఛార్జి ధారవత్ లాలయ్య నాయక్, యోగా మాస్టర్ ఎర్ర భూమయ్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, గణేష్, రమేష్, బట్టు సుమన్, కుతాడి ఎల్లయ్య, శ్యాంసుందర్, రాహుల్ రాజ్, గోవర్ధన్ రెడ్డి, కృషివర్ధన్ పాల్గొన్నారు.

## అధికారిక అనుమతులతోనే ఇసుక రవాణా : వీడీసీ



**అక్షరటుడే, భీమ్‌గల్ :** బడా భీమ్‌గల్ గ్రామ సమీపంలోని కప్పల వాగు నుంచి ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, అధికారిక అనుమతులతోనే సాగుతోందని వీడీసీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం కప్పలవాగు వద్ద గ్రామానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల స్థానిక నాయకులతో కలిసి వారు సమావేశం నిర్వహించారు. వీడీసీ ప్రతినిధులు మాట్లాడుతూ.. కప్పలవాగు ఇసుక రవాణాపై కొందరు నియోజకవర్గ, జిల్లాస్థాయి నాయకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. గ్రామంలో ఇసుక రవాణా అంతా వీడీసీ ఆధ్వర్యంలో పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్ ద్వారా డీడీలు చెల్లించి, సంబంధిత అధికారుల అనుమతులతోనే రవాణా సాగిస్తున్నామని వివరించారు. ఇందులో ఎలాంటి అక్రమాలు లేవని, దీనికి ఏ రాజకీయ పార్టీతోనూ ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోకుండా, కేవలం తమ రాజకీయ ఉనికిని చాటుకునేందుకే కొందరు నాయకులు ప్రెస్ మీట్లు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం చేసే ఆరోపణలతో బడా భీమ్‌గల్ గ్రామం ప్రతిష్ఠను దిగజార్చడం సరికాదన్నారు. ఇప్పటికైనా గ్రామంపై, ఇసుక రవాణాపై అసత్య ప్రచారాలను తక్షణమే నిలిపివేయాలని వీడీసీ సభ్యులు కోరారు. భవిష్యత్తులో సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా గ్రామంపై తప్పుడు ఆరోపణలు చేస్తే గ్రామస్తులంతా ఏకమై తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎర్రోళ్ల సంజీవ్, నాయకులు మోర్తాడ్ లింబాద్రి, రాగుల మోహన్, శ్రీధర్ గౌడ్, వెల్దుర్తి కిషన్, గట్టు సతీష్, చింతకింది భూమేశ్వర్ పాల్గొన్నారు.

## 'మాణిక్ భవన్' పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం




**అక్షరటుడే,ఇందూరు:** దశాబ్దాల తర్వాత కలుసుకున్న ఆ స్నేహితుల కళ్లల్లో ఆనందబాష్పాలు వెలకట్టలేనివి. హోదాలు, బాధ్యతలు పక్కనపెట్టి ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ ఆ బాల్య మిత్రులు ఆనందంతో చిందులేశారు. నగరంలోని నూతన వైశ్య ఉన్నత పాఠశాల(మాణిక్ భవన్) 1976-77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని మాణిక్ భవన్ 1976-77 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనాన్ని స్వర్ణోత్సవం పేరుతో ఘనంగా నిర్వహించారు. 50ఏళ్ల క్రితం పాఠశాలలో తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. తమ కుటుంబ వివరాలను ఒకరికొకరు పంచుకున్నారు. 'తలలు పండినా తరగని స్నేహం మాది'అంటూ ఆడిపాడారు. ఆనాడు తమకు విద్యాబుద్ధుల నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.







## బ్యాక్ వాటర్ ప్రాంతం చెత్తమయం

శ్రీరామ్ సాగర్ బ్యాక్ వాటర్ పరిసరాలు పర్యాటక శోభను సంతరించుకున్నాయి. ఈ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి ప్రజలు కార్లు, బైక్‌లపై తరలివస్తున్నారు. ఇక్కడే భోజనాలు, మద్యం సేవించి ఖాళీ సీసాలు పారేస్తున్నారు. అలాగే వాటిని పగలగొట్టడంతో ఇతర పర్యాటకులకు, పచ్చిక కోసం వచ్చే జింకలకు గాయాలవుతున్నాయి. బ్యాక్ వాటర్ పరిసరాలను పాడు చేయవద్దని స్థానికులు కోరుతున్నారు. – అక్షరటుడే, ఆర్మూర్





## ఆర్మూర్‌లో ఊర పండుగ..

ఆర్మూర్‌లో ఊర పండుగను ఆదివారం సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కల్గంకుడా ఏర్పాట్లు చేశారు. –అక్షరటుడే, ఆర్మూర్